క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉ. 10గంటల నుంచి సా. 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఈఈ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. 33కెవి లైన్‌కు మరమ్మతులు చేయాల్సిన నేపథ్యంలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు



ప్రతీక్‌జైన్‌కు మొక్కను అందజేస్తున్న నేతలు

బంట్వారం: జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పుష్పగుచ్ఛం అందించి పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. జిల్లా అభివృద్ధి విషయంలో బీజేపీ తరఫున తమ సంపూర్ణ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

వర్షాలు కురవాలని..



బోనాల ఊరేగింపు

దౌల్తాబాద్: వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని ర్యాలగుట్టతండా ప్రజలు ఆదివారం పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. నెల రోజుల నుంచి వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్నాయని వరుణదేవుడు కరుణించాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ముదిరాజ్‌లకు అండగా ఉంటాం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు


కుల్కచర్ల: ముదిరాజ్ కుటుంబాలకు అండగా ఉంటామని మత్స్య సహకార సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన వరంగల్ బాలయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నానాటికి వెనుకబాటుకు గురవుతున్న ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొగులయ్య, సిద్ధయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, సాయప్ప, భీమయ్య, వెంకప్ప, కిష్టయ్య, బసప్ప, రాములు, నర్సింలు, కేశవులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

మహిళ మృతి

పూడూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మమ్మ(62) భర్త వడ్డె వెంకటయ్యతో గొడవపడి జూన్ 29న మధ్యాహ్నం పీరంపల్లిలోని తన చెల్లెలు వద్దకు కాలినడకన వెళ్తుండగా మండల పరిధిలోని రాకంచర్ల శివారులో ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో లక్ష్మమ్మకు తీవ్రగాయాలై.. అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో పట్టణానికి చెందిన సరస్వతి డిగ్రీ కళాశాల 2006–09 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరుపుకొన్నారు. ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలరించుకుని యోగా క్షేమాలు తెలుసుకున్నారు. తమ తోటి వారికి ఎవరికైనా కష్టం వస్తే అందరం కలిసికట్టుగా ఆందుకుందామని నిర్ణయించున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కనకదుర్గతో పాటు పలువురు అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చైతన్య, దేవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.



హస్నాబాద్‌లో నెల రోజులుగా పేరుకుపోయిన చెత్త



హస్నాబాద్‌లో నిండుకున్న మురుగు కాలువ

సీజనల్‌పై అప్రమత్తత ఏదీ?

ఏటా వర్షాకాలంతో పాటే రోగాలు కూడా జంటగా కలసి వస్తున్నా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం, వైద్యాధికారులు విఫలం అవుతున్నారు. ప్రజలబాధ ప్రజలదే తప్ప ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు అరుదు. ఎక్కడైన మరణాలు సంభవిస్తే తప్ప కదలిక రావడం లేదు.

- గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం
- పరిశుభ్రతపై అవగాహన కరువు
- ఎక్కడి చెత్త అక్కడే.. నిండుకున్న మురుగు కాలువలు
- వ్యాధులు సోకే అవకాశాలు



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

దుద్యాల్ : అసలే వర్షాకాలం.. గ్రామాల్లోని వీధులు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు పుట్టుకొచ్చి సీజనలు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా మండలంలోని గ్రామాల్లో ఇప్పటివరకు సీజనలు వ్యాధులపై ఎలాంటి అవగాహన చేపట్టకపోవడం ప్రభుత్వం, వైద్యాధికారుల నిర్లక్ష్యానికి అందం పడుతోంది. మండలంలోని హకీంపేట గ్రామంలోని వైద్య సిబ్బంది ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు ప్రతి గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యక్తి గత పరిశుభ్రత, వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తారు. ఇతర ఏ గ్రామాల్లో కూడా పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు కనిపించవు. మండలంలో అధిక ప్రజలు ఉన్న దుద్యాల, హస్నాబాద్, కుదురుమల్ల, హకీంపేట గ్రామాలతో పాటు తక్కువ జనాభా కల్గిన గ్రామాలు, గిరిజన తండాలు చాలా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల సంబంధిత వైద్య సిబ్బంది తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం అంతంత మాత్రంగానే ఉంది. ఎక్కడ పడితే అక్కడే చెత్తచెదారం, వ్యర్థాలతో నిండి అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యం, వ్యక్తిగత శుభ్రత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

మండలంలోని గ్రామాల్లోని వీధుల్లో చెత్త కుప్పలు కుప్పలు దర్శనమిస్తోంది. దీంతో పుట్టుకొచ్చి సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పంచాయతీ కార్మికులకు జీతాలు లేకపోవడంతో గ్రామాల్లో చెత్తను తీయడం లేదు. మురుగు కాలువలు నిండి రోడ్లపైకి వచ్చి దుర్వాసన వస్తుంది.. దీంతో చెత్త కుప్పలు పెరుకుపోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

తాండూరులో వర్షం

- జలమయమైన వీధులు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలో ఆదివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగి పొర్లడంతో బురద నీరంతా వీధుల్లో తిష్టవేసింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. వానాకాలం వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇళ్ల మధ్య నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు బెడద పెరిగి అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వర్షం నీరు బయట కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వర్షం..హర్షం..

తాండూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతుల మోములు చిగురించాయి. పక్షం రోజులుగా వర్షాలు కురవకపోవడంతో కర్షకులు ఆందోళన చెందారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి పంట పొలాలకు ఊపిరిపోశాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు జోరువాన కురిసింది. దీంతో వరద నీటితో పంట పొలాల్లో నీరు నిలిచాయి. మరోవైపు ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్ లోని ప్రధాన రోడ్డు మార్గంలో మోకాలు లోతు వదర నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదైంది.



భారీ వర్షానికి పంట పొలంలో నిలిచిన నీరు

పరిగిలో మోస్తరు వర్షం

పరిగి: వర్షాకాలం ప్రారంభమైన తరువాత చిన్నపాటి ఒకటి రెండు వర్షాలు కురవడంతో రైతులు విత్తనాలు విత్తుకున్నారు. మొలకెత్తిన పంటలు ఎండిపోతుండటంతో వర్షం కోసం రైతన్నలు దిగులుగా ఎదురుచూస్తున్నా తరుణంలో ఆదివారం పరిగి చుట్టుపక్కల ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసింది. దీంతో కర్షకులు ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లు అయిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నాపరాతి పాలిషింగ్ యూనిట్‌లో వరద నీరు



ఎన్టీఆర్ కాలనీలో..



పరిగిలో కురుస్తున్న వర్షం



12వ వార్డులో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



ఇందిరాచౌక్ రోడ్డుపై నిలిచిన వరద నీరు



శాంతినగర్‌లో నీటిలో ఇరుక్కుపోయిన స్కూటీ

కాలె యాదయ్యకు సన్మానం

పూడూరు: ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆదివారం ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, అజీంపటేల్, నాయకులు రాంచంద్రారెడ్డి, గౌస్‌పటేల్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే యాదయ్యను సన్మానించిన రామ్మోహన్‌రెడ్డి

నేడు రైతు భరోసాపై అవగాహన

ధారూరు: మండలంలోని రైతులకు సోమవారం మ. 2 గంటలకు రైతు భరోసాపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశాన్ని ధారూరు రైతు వేదికలో నిర్వహిస్తున్నామని, రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలను సేకరించనున్నట్లు వివరించారు. మండలంలోని రైతులంతా సకాలంలో హాజరై తమ అభిప్రాయాలను సూచించాలని కోరారు.

2న పీఏసీఎస్ గోదాంలో ..

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం ఆవరణలో జూలై 2న మంగళవారం రైతుభరోసాపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుభరోసా పథకంలో భాగంగా రైతుబంధు ఎన్ని ఎకరాలకు అమలు చేయాలి, తదితర అంశాలపై పలువురు రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో సకాలంలో హాజరుకావాలని కోరారు. రైతుల అభిప్రాయాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు.

సెలవు రోజు పాఠశాల నిర్వహణ



పాఠశాల నుంచి బయటకు వెళ్తున్న విద్యార్థులు

తరగతులు బహిష్కరించిన ఏబీవీపీ నాయకులు

తాండూరు టౌన్ : సెలవు దినంలో పాఠశాల కొనసాగిస్తున్న విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు తరగతులు నిలిపివేయించారు. తాండూరు పట్టణంలోని వినాయక్‌చౌక్‌లో ఉన్న కృష్ణవేణి కాన్సెప్ట్ పాఠశాల యాజమాన్యం ఏకంగా ఆదివారం రోజు ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు తరగతులు కొనసాగిస్తున్నారు. దీంతో ఏబీవీపీ నాయకులు అక్కడకు చేరుకుని సెలవు దినంలో పాఠశాల నడపటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతుల నుంచి విద్యార్థులందరినీ బయటకు పంపించేశారు. తల్లిదండ్రుల మెప్పు పొందేందుకు సెలవు దినంలో తరగతులు నిర్వహిస్తున్నారు. దుయ్యబట్టారు. ఈ విషయమై విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఆదివారం పాఠశాల నిర్వహణపై ప్రిన్సిపాల్ ప్రశాంత్‌ను వివరణ కోరగా ఇటీవల ఏబీవీపీ బంద్ జరిగిందని, అందుకు ఆదివారం పాఠశాల కొనసాగించినట్లు చెప్పడం గమనార్హం.

కంటి చూపుతోనే మెరుగైన జీవితం



వైద్య శిబిరంలో పాల్గొన్న సత్యసాయి భక్తులు

కొడంగల్ : కంటి చూపుతో మెరుగైన జీవితం లభిస్తుందని సత్యసాయి భజన మండలి భక్తులు పేర్కొన్నారు. పట్టణంలోని అక్షర పాఠశాలలో సత్యసాయి భజన మండలి భక్తుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన శంకర కంటి ఆస్పత్రి సిబ్బంది పర్యవేక్షణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాల్మిక్ అసిస్టెంట్ సహద్ కంటి పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మనిషి శరీరంలోని అన్ని భాగాల కంటే కంటికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. కంటి చూపు లేకపోతే ప్రపంచం అంధకారంగా మారుతుందన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంతో పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. 125 మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 35 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్లు చెప్పారు. వారిని ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. మందులు, అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు సత్యసాయి భజన మండలి భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు లెక్కలకేనా?

- నర్సరీల్లో వాడిపోతున్న వైనం
- నీరుగారుతున్న లక్ష్యం
- అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హరితహారం పథకం నిర్వహణ కొరవడి అభాసుపాలవుతోంది.. నాటిన మొక్కలు కాగితాల్లో తప్ప.. క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.. మొక్కలు నాటడంలో ఉత్సాహం చూపిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు సంరక్షణను విస్మరిస్తున్నారు. దీంతో రూ. కోట్ల వృథా అవుతున్నాయి.



పెద్దేముల్ మండల గాజీపూర్ నర్సరీలో మొక్కలు రాక ఖాళీగా ఉన్న బెడ్లు

పెద్దేముల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం మండలంలో నీరు గారుతుంది. పచ్చదనంతో ఆహ్లాదకరంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఏటా కోట్ల రూపాయాల నిధులు వ్యయం చేస్తుంది. అధికారుల నిర్లక్ష్యంతో పథకం లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. నర్సరీల్లో మొక్కలు లెక్కలకు తప్ప.. క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. వెరసి రూ. కోట్ల నిధులు వృథా అవుతున్నాయి. ప్రధాన రహదారుల పక్కన ప్రతి ఏటా వేల మొక్కలు నాటిన వాటి సంరక్షణ సక్రమంగా లేక పెట్టిన మున్నాళ్లకే ఎండిపోతున్నాయి. ప్రభుత్వానికి టార్గెట్ చూయించడం తప్ప నాటిన మొక్కల్లో యాభై శాతం కూడా దక్కడం లేదని తెలుస్తుంది. దీంతో మళ్లీ ఏటా నాటిన ప్రాంతాల్లోనే మళ్లీ కొత్తగా మొక్కలు నాటుతూ లక్ష్యం చేరినట్లు చూపుతున్నారు. మొక్కలను సంరక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుంది. ఏటా నర్సరీల్లో వేల మొక్కలు ఏర్పాటు చేస్తున్నా లాభం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొక్కలు నాటడంపై చూయిస్తున్న శ్రద్ధ వాటి సంరక్షణపై ఎందుకు చూయించడం లేదని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 37 వన నర్సరీల ద్వారా సుమారు 92వేల మొక్కలను సిద్ధం చేసింది. వాటిని ప్రధాన రహదారుల పక్కన, పాఠశాల ఆవరణలో, ప్రభుత్వ ఖాళీ స్థలంలో, దేవాలయాల వద్ద నాటాల్సి ఉంది. ఈ ఏడాది పెద్దేముల్ మండలంలో సుమారు 92 వేల మొక్కలను నాటాలని టార్గెట్. ప్రతి ఏటా ప్రభుత్వం మండలంలో తాండూరు–సంగారెడ్డి, తాండూరు–హైదరాబాద్, తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారులపై వేల మొక్కలు నాటుతున్న 20 శాతం కూడా మొక్కలు బతకడం లేదు. ఏటా అదే గుంతలు, అదే రోడ్లపై ఉపాధి హామీ సిబ్బందితో మొక్కలు నాటించి లెక్కలు చూయిస్తున్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పెంపకంపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. నర్సరీల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించినా ప్రయోజనం కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క మొక్క పెంచేందుకు సుమారు రూ.7 లు మంజురు చేస్తున్నట్లు సమాచారం. కొన్ని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు, నాటుతున్న మొక్కలకు పొంతన ఉండటం లేదని తెలుస్తోంది.

ఉన్నతాధికారులు సందర్శించాలి



హరితహారం నర్సరీలను ఉన్నతాధికారులు నెలకు ఓ సారి సందర్శించాలి... అప్పుడే కార్యక్రమం విజయవంతమవుతుంది. ఏటా మొక్కలు నాటాం. .పంపిణీ చేశామని చెప్పడం తప్ప.. నాటిన మొక్కలు ఎన్ని ఉన్నాయి.. ఎటు పోయాయి అని పరిశీలించే వారే లేరు. దీంతో హరితహారం పథకం లక్ష్యం చేరుకోలేక పోతుంది. మండల అధికారుల పర్యవేక్షణ అసలకే లేదు. గతంలో అధికారులు ప్రతి నిత్యం వననర్సరీలు తనిఖీ చేసేవారు.

– శ్రీనివాస్ – మంబాపూర్ ఎంపీటీసీ

ప్రతి మొక్క బతికేలా చూస్తాం..



వననర్సరీలో పెంచుతున్న మొక్కలను వందశాతం సంరక్షించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి మొక్క బతికేలా చుస్తాం. మొక్కలు పాడైన స్థానంలో మళ్లీ మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటాం. గాజీపూర్, తట్టెపల్లితో పాటు అన్ని గ్రామాల్లో మొక్కలు పరిశీలిస్తాం. మొక్కలు ఎండినట్లు ఉంటే చర్యలు తీసుకుంటాం.

– నర్సింలు ఉపాధి పీఓ, పెద్దేముల్



పెద్దేముల్ మండలం తట్టెపల్లి నర్సరీలో వాడిపోతున్న మొక్కలు



గాజీపూర్‌లో..

మన్‌కీ బాత్ వీక్షణ



మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న ప్రజలు

అనంతగిరి: భారత ప్రధానిగా మూడోసారి ఎన్నిక అయ్యాక మొదటిసారి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం బీజేపీ నాయకులు, అభిమానులు తిలకించారు. వికారాబాద్ పట్టణంలోని శివాజి నగర్‌కాలనీలో కౌన్సిలర్ శ్రీదేవిసదానందరెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు వీక్షించారు.

నేడు ప్రజావాణి

ధారూరు: మండల పరిషత్ కార్యాలయంలో నేడు (సోమవారం) ఉ.10:30 గంటల నుంచి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నర్సింహులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఈ ప్రజావాణిలో లిఖిత పూర్వకంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తులను ఆయాశాఖల అధికారులకు పంపించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉ.11గంటలకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చే సమస్యలపై ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. రెవెన్యూ సమస్యలపై ఇప్పటికే రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారని ఇకపై మండల పరిషత్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.